క్లుప్తంగా...

కార్మికుల సమస్యలను మేనిఫెస్టోలో పొందుపర్చాలి


వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వేముల మారయ్య, తదితరులు

మల్లాపూర్: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌కు బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, రాష్ట్ర కనీస వేతనాల చైర్మన్ నారాయణ వినతి పత్రం అందజేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రైవేట్ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాల జీవోల సవరణ అంశం, ఆటో మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రైవేట్ కార్మికుల ఉద్యోగ విరమణ వయస్సు పెంపు తదితర అంశాలను మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు.

ఎంబీబీఎస్ చదువుతున్న పూర్వ విద్యార్థికి సన్మానం



కాప్రా: విజయ స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థిని జె.రోజా తన లక్ష్య సాధనలో భాగంగా ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్ కాబోతున్న విద్యార్థిని తమ స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థి కావడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు స్కూల్ యాజమాన్యం. ఈ సందర్భంగా ఆమెకు రూ.10,116 నగదు ప్రోత్సాహకం అందించారు. ఆమెను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్లపల్లి జైలులో నర్సరీ ఏర్పాటు


చర్లపల్లి జైలులో నర్సరీని ప్రారంభిస్తున్న డాక్టర్ డి.శ్రీనివాస్

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో నూతనంగా నర్సరీని ఏర్పాటు చేశారు. శుక్రవారం జైళ్లశాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ డాక్టర్ డి.శ్రీనివాస్ నర్సరీని ప్రారంభించారు. జైల్‌లో నర్సరీ ఏర్పాటు చేసి 20 వేల మొక్కలను అందుబాటులో ఉంచడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో జైల్ పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్‌రాయ్, ఓపెన్ ఎయిర్ జైల్ పర్యవేక్షణాధికారి కళాసాగర్, శశికాంత్, రామకృష్ణ, పరుశరాం, సత్తయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్లాన్‌తో ముందుకెళ్లాలి



ఉప్పల్: నోడల్ అధికారులు పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్లాలని ఉప్పల్ డీసీ ఈఆర్‌వో శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ ఆర్‌వో కార్యాలయంలో నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విధి విధానాలపై చర్చిస్తూ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. 16 మంది నోడల్ అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు


విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

మేడిపల్లి: ఢిల్లీలో నిర్వహించిన క్రీడల్లో బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఆ పాఠశాల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. మేడిపల్లిలో బచ్‌పన్ అకామిక్ హైట్స్ స్కూల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. మెగా కాంపిటీషన్ పోటీల్లో బచ్‌పన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు వివరించారు. చదువుతోపాటు అన్ని క్రీడల్లో విద్యార్థులు రాణించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోత్స్నదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల భర్తీ లేదు..
స్వచ్ఛత జాడ లేదు..

- 13 పురపాలికల్లో ఔట్ సోర్సింగ్ కింద 1,746 మంది పారిశుద్ధ్య కార్మికులు
- ఏళ్లుగా భర్తీ కాని ఖాళీ పోస్టులు
- రెగ్యులర్ కార్మికులు లేక ఇబ్బంది
- భర్తీ చేయాలంటున్న పట్టణ ప్రజలు





సాక్షి, మేడ్చల్ జిల్లా: ఏళ్లుగా పోస్టుల భర్తీ లేకపోడంతో పురపాలికల్లో శాశ్వత పారిశుద్ధ్య కార్మికుల కొరత తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. మురుగు కాల్వలు శుభ్రం చేసే కామాటీలు, రహదారులు, వీధులను శుభ్రం చేసే స్వీపర్లు తగినంత మంది లేకపోవడంతో పట్టణాల్లో స్వచ్ఛత గాడి తప్పుతోంది. జిల్లాలోని 13 పురపాలికల్లో ఇదే దుస్థితి నెలకొంది. నాటి నుంచి ఈ పట్టణాల్లో పారిశుద్ధ్య విభాగాల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోంది.

అమలుకు నోచుకోని నిబంధనలు

రాష్ట్ర పురపాలక శాఖ పరిపాలనా విభాగం నిబంధనల ప్రకారం ప్రతి 10వేల జనాభాకు 28 మంది రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాల్సి ఉంటుంది. జిల్లాలోని 13 పురపాలికల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 4,24,239 జనాభా ఉంది. ప్రస్తుతం ఈ 13 పురపాలక సంఘాల్లో ఔట్ సోర్సింగ్ కింద 1,746 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు.

- గ్రేటర్ హైదరాబాద్ శివారుగా ఉన్న 13 పురపాలికల్లో గణనీయంగా జనాభా పెరుగుతుండటంతో 8 లక్షలు దాటవచ్చని అంటున్నారు. ఈ లెక్క ప్రకారం శివారు పురపాలక సంఘాల్లో 2,240 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేయాల్సి ఉంది.
- 13 పురపాలక సంఘాల్లో ప్రస్తుతం రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. పురపాలికల్లో ఔట్ సోర్సింగ్ సేవల కింద నియమించిన కార్మికులతోనే పారిశుద్ధ్య వ్యవస్థను కొనసాగిస్తున్నారు.

ప్యానల్ పోస్టులకే ప్రాధాన్యం

పురపాలికల్లో కమిషనర్లు, ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, మేనేజర్లు, అకౌంటెంట్లు, ఆర్ఐలు, క్లర్కులు, బిల్ కలెక్టర్లు వంటి ప్యానల్ పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్న ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల విషయాన్ని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. గడిచిన రెండేళ్లలో టీఎస్‌పీఎస్సీ ద్వారా జిల్లాలోని పురపాలికల్లో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల్లో ప్యానల్ పోస్టులు భర్తీ అయ్యాయి. అవసరం ఉన్న పారిశుద్ధ్య కార్మికుల పోస్టులు మాత్రం ఖాళీగానే ఉండిపోయాయి.

పురపాలక సంఘాల వారీగా..

మేడ్చల్ జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో ఔట్ సోర్సింగ్ కింద 1,746 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తుండగా, ఇందులో పురపాలికల వారీగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య ఈ విధంగా ఉంది. పీర్జాదిగూడలో 56 మంది పారిశుద్ధ్య కార్మికులు, నిజాంపేటలో 248, నాగారంలో 145, మేడ్చల్‌లో 139, కొంపల్లిలో 188, జవహర్‌నగర్‌లో 90 మంది పనిచేస్తున్నారు. అలాగే, బోడుప్పల్‌లో 182, దుండిగల్‌లో 150, ఘట్‌కేసర్‌లో 86, గుండ్లపోచంపల్లిలో 120, దమ్మాయిగూడలో 157, పోచారంలో 111, తూముకుంటలో 74 మంది పారిశుద్ధ్య కార్మికులు ఔట్ సోర్సింగ్ కింద సేవలందిస్తున్నారు.

మల్కాజిగిరిలోని సమస్యలను పరిష్కరిస్తా

మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి



అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరిలో మూడోసారి హ్యాట్రిక్ విజయం ఖాయమన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వాజ్‌పేయినగర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. బొల్లారంలో రైల్వే క్రాసింగ్ వద్ద బ్రిడ్జిల నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానన్నారు. 278 సర్వే నంబర్ భూసమస్య పరిష్కరిస్తానన్నారు. బ్యాంక్ కాలనీ, నేరేడ్‌మెట్ భూమస్యతోపాటు గౌతంనగర్‌లోని మల్లికార్జుననగర్‌లో నెలకొన్న యూఎల్‌సి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. వక్ఫ్ భూముల సంరక్షణ, ఎండోమెంట్ భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేద్దాం


గడప గడపకు కార్యక్రమంలో వజ్రేష్‌యాదవ్ తదితరులు

బోడుప్పల్: కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పలు డివిజన్లలో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమరవీరుల త్యాగాలకు అనుగుణంగా, ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజారంజక పాలన అందిస్తామన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త సుశాంత్‌గౌడ్, బీబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శులు కొత్త ప్రభాకర్ గౌడ్, విశ్వంగుప్తా, నేతలు బొమ్మక్ రమేష్, వెంకటేశ్‌గుప్తా, తోటకూర అశోక్‌యాదవ్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లలో బతుకమ్మ సంబరాలు


జేజీఆర్ ఉన్నత పాఠశాలలో..

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో..

మౌలాలి: నేరేడ్‌మెట్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ రేబక మన్మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాప్రా: బతుకమ్మ ఉత్సవాలను కాప్రాలోని విజయ స్కూల్‌లో నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి ప్రారంభించి బతుకమ్మ ఆడారు. స్కూల్ ఫౌండర్ విజయలక్ష్మి, కరస్పాండెంట్ రాజేశ్వర్, డైరెక్టర్ వీణ, భ్రమరాంబికరాణి, ప్రిన్సిపల్ వెంగమాంబ పాల్గొన్నారు.




నేటి నుంచి బతుకమ్మ సంబురాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నుంచి బతుకమ్మ సంబురాలు ప్రారంభం అవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల మహిళలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. శిల్పారామంలో శుక్రవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్య గురువు కిరణ్మయి శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. స్నేహ, వర్ణిత, శ్రీలత, నిత్యశ్రీ, కార్తీక, అనఘా రుషిక నృత్యంతో మెప్పించారు.

రా చెరువులో చేపల మృతి


చేపలను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

బోడుప్పల్: బోడుప్పల్ రా చెరువులోకి పొల్యూషన్ వాటర్ రావడంతో చెరువులో ముదిరాజ్ కులస్తులు పెంచుకుంటున్న చేపలు మృత్యువాత పడుతున్నాయి. శుక్రవారం చేపలు చనిపోయి ఒడ్డుకు చేరడంతో ముదిరాజ్ కులస్తులు వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ముదిరాజ్ కులస్తులు మాట్లాడుతూ మల్కాజిగిరి, నాచారం, మల్లాపూర్ పారిశ్రామికవాడల నుంచి వచ్చే కెమికల్ వాటర్‌తో రా చెరువులో నీరు కలుషితం అవుతోంది. దీంతో చేపలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, 19వ డివిజన్ కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి చెరువును సందర్శించి ముదిరాజ్ సంఘం ప్రతినిధులను పరామర్శించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మల్లాపూర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ గంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జనగాం జిల్లాకు చెందిన బస్కుల దుర్గారాజ్(45) లేబర్. మల్లాపూర్ కేఎల్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి మల్లాపూర్ లేపాక్షి ఫర్నిచర్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన యాక్టివ్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా మృతి చెందడాని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రంగోజు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ట్యూషన్ మాస్టర్‌పై కేసు

ఉప్పల్: ఇంటికి ట్యూషన్‌కు వచ్చిన బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన లెక్కల మాస్టర్‌ను ఉప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై నెహ్రూ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ ఈస్ట్ కళ్యాణపురి ప్రాంతానికి చెందిన జోసఫ్(52) వృత్తిరీత్యా ట్యూషన్ మాస్టర్. అతడి వద్దకు గణితం ట్యూషన్ కోసం ఇంటికి వెళ్లిన బాలిక(15) పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. వారు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు అతడిని చేసి రిమాండ్‌కు తరలించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి జైలు

మల్కాజిగిరి: ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులకు ఐదవ స్పెషల్ ఎంఎం కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించిందని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. నంబర్ ప్లేట్స్ సరిగాలేని ఒకరికి రూ.3 వేలు, ఏడు రోజులు జైలు, ఒకరి రూ.3 వేలు, ఒకరోజు జైలు, మరొకరికి రూ.2 వేలు, ఒకరోజు జైలు, మద్యం తాగినవారిలో 14 మందికి రూ.2 వేలు, ఏడుగురికి రూ.2,500, ఒకరికి రూ.3,500 వేల జరిమానా విధించిందన్నారు.

ఉప్పల్‌లో 100 పడకల ఆస్పత్రి

- అపరిష్కృత స్థలాలను రెగ్యులరైజ్ చేయించా
- ఎవరికి ఏ కష్టం వచ్చినా మీ ముంగిట ఉంటా
- ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

జంగ్ తెలంగాణ 2023



చిలుకానగర్ డివిజన్ బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: మీలో ఒకడిగా ఆశీర్వదించండి.. నిరంతరం సేవ చేస్తానని ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. చిలుకానగర్ డివిజన్‌లో కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు అధ్యక్షతన నాచారంలోని బాబా ప్యాలెస్‌లో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు మహిళలు బతుకమ్మ, బోనాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తన ట్రస్టు ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. తనను బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న స్థలాలను రెగ్యులరైజ్ చేయించానన్నారు. ఇక్కడి ప్రజలు పెద్దాస్పత్రి కావాలని దశాబ్దకాలంగా కృషి చేస్తున్నారని, వెంటనే ఉప్పల్‌లో 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయించినట్లు చెప్పారు. డిగ్రీ కళాశాలకు భవనం, త్వరలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. విదేశాల్లో చదువుకునే వారికి, ఆడపిల్లల పెళ్లిళ్లు, చదువు, ఇలా ఎవరికి ఏ కష్టం వచ్చినా మీ ముంగిట ఉంటానని హామీ ఇచ్చారు. అర్హులైన వారికి బీసీ, దళిత బంధు, గృహలక్ష్మీ ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, నెర్థం భాస్కర్‌గౌడ్, జెల్లి మోహన్, అంబటి జగదీష్, గోపు సదానంద్, రమేష్, మైనార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం చేయాలి


కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో సమావేశమైన బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ఎన్నికల ప్రచారంపై బీఆర్‌ఎస్ నాయకులు కార్యచరణ చేపట్టారు. శుక్రవారం బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏ విధంగా ప్రచారం చేయాలి, ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను ఏ విధంగా తీసుకెళ్లాలనే అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేస్తూ ఓటు అభ్యర్థించాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనక రాజుగౌడ్, పాండాల శివకుమార్‌గౌడ్, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బొడిగె ప్రభుగౌడ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడిస్తాం

కుషాయిగూడ: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడిస్తామని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ అన్నారు. ఈసీఐఎల్‌లో ఏఐవైఎఫ్ 2వ మహాసభల పోస్టర్‌ను శుక్రవారం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. మహిళల రక్షణ, విద్యార్థుల ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ, పేపర్ లీకేజీల వంటి ప్రజావ్యతిరేక విధానాలే బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతాయన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ నాయకులు గిరిబాబు, శివ, మురళి, జోగితా, స్వప్న, భార్గవ్, కీర్తన్ తదితరులు పాల్గొన్నారు.


ఈసీఐఎల్‌లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

సైలెంట్ ఓటింగే కాంగ్రెస్‌ను గెలిపిస్తుంది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు


కాంగ్రెస్‌లో చేరుతున్న సంతోష్ ముదిరాజ్, తన అనుచరులు

మల్కాజిగిరి: ఈసారి ఎన్నికల్లో సైలెంట్ ఓటింగే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మల్కాజిగిరి డివిజన్ మల్కాజిగిరిలో సాయినాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందలేదని, పాలన గాడి తప్పిందన్నారు. ఉద్యోగులకు 5 శాతం ఐఆర్ ప్రకటించిన కేసీఆర్ గొప్పలు చెప్పుకుంటున్నాడని, కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 27 శాతం ప్రకటించారన్నారు. ప్రజల్లోనే కాకుండా ప్రభుత్వ ఉద్యోగుల్లో కూడా ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఇదంతా సైలెంట్ ఓటింగ్‌గా మారి బీఆర్‌ఎస్ ఓటమి ఖాయమన్నారు. సమావేశంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నాయకులు జీఎస్వీ సతీస్‌కుమార్, జీడీ సత్యనారాయణగౌడ్, శ్రీనివాసరెడ్డి, నాగేందర్‌గౌడ్, గౌస్, సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

మౌలాలి: అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, వినాయక్‌నగర్ డివిజన్‌కు చెందిన సంతోష్ ముదిరాజ్ శుక్రవారం పార్టీలో చేరారు. బీ–బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, శ్రీను, ఉమేష్‌సింగ్, శ్రీనివాస్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, మీనా కుమారి, శ్రీనివాస్, బాలరాజుయాదవ్, నాగరాజు పాల్గొన్నారు.